# కాంగ్రెస్‌వి బూటకపు హామీలు

■ చెప్పింది చేసే నాయకుడు సీఎం కేసీఆర్ ■ పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ■ ఆఖరి రోజు ముమ్మర ప్రచారం



బర్కత్‌పల్లిలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళ

పరిగి, నవంబర్ 28 : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇస్తున్నవి బూటకపు హామీలని పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. కేవలం ఎన్నికలలో ఓట్లు దండుకోవాలనే ఆలోచనతోనే కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి మోసం చేయాలని చూస్తున్నదన్నారు. మంగళవారం పరిగి మండలంలోని బర్కత్‌పల్లి, నస్కల్, రుక్కుంపల్లి గ్రామాలతోపాటు పరిగి పట్టణంలో రోడ్‌షో నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ప్రజా సంక్షేమంపై ఆలోచించలేదని, తమ సంక్షేమానికే కాంగ్రెస్ నాయకులు పనిచేశారన్నారు. తెలంగాణ సాధించిన నాయకుడు, ప్రజల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాలలో ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందేలా పాలన సాగించారన్నారు. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేయాలనే తలంపుతో రైతుబంధు ద్వారా ఎకరాకు సంవత్సరానికి రూ.10వేలు పెట్టుబడి సహాయం అందిస్తున్నారని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నోటి కాడి బుక్కను కాంగ్రెస్ లాగేసిందన్నారు. మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధును రూ.16వేలకు పెంచనున్నట్లు చెప్పారు. పేదలందరికీ రూ.400లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడం ద్వారా పేదలపై భారం పడకుండా సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టనున్నారని అన్నారు. పరిగి అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనే జరిగిందన్నారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని పరిగి పట్టణానికి రెండు విడతల్లో రూ.40కోట్లు మంజూరు చేశారని, రూ.15కోట్ల విలువ చేసే పనులు పూర్తి కావచ్చాయని, మిగతా పనులకు టెండర్లు పిలిచారని చెప్పారు. ప్రజలకు సేవ చేసేందుకు తనకు మరో అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పరిగిలో పాలిటెక్నిక్ కళాశాల, కులకచర్లలో ఐటీఐ, జూనియర్ కళాశాలల ఏర్పాటు, దాదాపూర్, కంకల్ మండలాల ఏర్పాటు, గండీడ్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపడానికి సంబంధించి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, వాటన్నింటినీ చేయించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి, జడ్పీటీసీ హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు మేడిద రాజేందర్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాస్, రాంచంద్రయ్య, ఎంపీటీసీ సంపూర్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




పరిగిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న యువకులు

# చివరి రోజు ముమ్మరంగా ప్రచారం



కులకచర్ల: మందిపల్‌లో ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకుడు మఠం రాజశేఖర్

కులకచర్ల, నవంబర్ 28: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరిగి పరిగి ఎమ్మెల్యేగా కొప్పుల మహేశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు మఠం రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. చౌడాపూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు మాసయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కులకచర్ల మండల పరిధిలోని బండమీదితండాలో బీఆర్‌ఎస్ గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రచారం హోరెత్తించారు.




కులకచర్ల : చౌడాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బొంరాస్‌పేట: బాపల్లితండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ హేమీబాయి

**బొంరాస్‌పేట:** బాపల్లితండాలో ఎంపీపీ హేమీబాయి, రేగడి మైలారంలో ఎంపీటీసీ జగదీశ్, పార్టీ నాయకులు శ్యామలయ్యగౌడ్ తదిత రులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేప ట్టిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించా లని వారు ఓటర్లను కోరారు. నమూనా ఈవీఎంను ఓటర్లకు చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు.
**దోమ:** మండల పరిధిలోని బొంపల్లితండా గ్రామ పంచా యతీలో సర్పంచ్ తారీబాయి, బీఆర్‌ఎస్ యువ నాయకుడు మాణ్యానా యక్‌తో కలిసి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అగాగే బట్లచందారం గ్రా మంలో సర్పంచ్ రాములు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో హరిశ్చం దర్, దేవ్‌లానాయక్, హర్యానాయక్, చెన్నానాయక్, ఆశప్ప పాల్గొన్నారు.



దోమ: బొంపల్లితండాలో ...

## మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (కొత్తపల్లి) నవంబర్ 28: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కొడంగల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని రేణివాట్ల, నిడ్జింత గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాదుకదా, ముఖ్యమంత్రి ఆఫీస్‌లో అటెండర్ కూడా కాలేడు అన్నారు. రేవంత్‌రెడ్డి కేసీఆర్ కాలు గోటికి కూడా సారి పోడు దమ్ముంటే తన మీద గెలువాలని సవాల్ చేశారు. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి గా హ్యాట్రిక్ కొట్టడం పక్కా అన్నారు. అలాగే నూతన ప్రభుత్వం ఏర్పాటు కాగానే సీఎం కేసీఆర్ కొత్త మ్యానిఫెస్టోను అమలు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులంతా ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే ఉన్నందున ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తిరుగు లేదన్నారు. ఆరు గ్యారెంటీలు కాదు కాంగ్రెస్‌కే గ్యారెంటీ లేదాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ డైరెక్టర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- పరిగి రిటర్నింగ్ అధికారి విజయకుమారి

పరిగి, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరిగి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక ఏపీవో, ఇరువురు ఓపీఓలు, బూత్ లెవల్ ఆఫీసర్లు ఉంటారన్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం 2,59,422 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,31,163 మంది, మహిళలు 1,28,250 ఇతరులు 9 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 165 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహిస్తామని, 60 పోలింగ్ స్టేషన్‌ల బయట సైతం వెబ్ క్యాస్టింగ్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో 72 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లుగా గుర్తించామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు 1849 మంది, జిల్లాలో పనిచేస్తున్న వారు 1139 మంది ఉన్నారని, ఎవరినైనా పోస్టల్ బ్యాలెట్ రానియెడల ఎన్నికల విధుల ఆర్డర్ కాపీ చూపిస్తే పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చినట్లు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 2651 మంది ఉండగా 15 మంది, వికలాంగులు 4315 మంది ఉండగా 9 ఇంటి దగ్గర నుంచి ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకోగా వారందరికీ అవకాశం కల్పించామన్నారు. సీ విజిల్ ద్వారా ఇప్పటివరకు 31 ఫిర్యాదులు అందాయని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.31,18,160 నగదు, 241.650 గ్రాముల బంగారం పట్టుబడిందని తెలిపారు.

### నేడు పోలింగ్ సామగ్రి పంపిణీ

పరిగిలోని మినీ స్టేడియంలో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి విజయకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు పోలింగ్ సామాగ్రి తీసుకువెళ్లేందుకు 27 పెద్ద బస్సులు, 15 చిన్న బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 22 మంది సెక్టోరియల్ ఆఫీసర్లకు ఇతర వాహనాలు ఏర్పాటు చేయడంతోపాటు అన్ని వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

దోమ, నవంబర్ 28: వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో యాదగిరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి సీఈవో యాదగిరి ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### దోమలో పోలీసుల కవాతు

దోమ, నవంబర్ 28: ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై రవిగౌడ్ అన్నారు. దోమ మండల కేంద్రంలో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు సిబ్బందికి సహక రించాలని ఎస్సై రవిగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హోమ్ గార్డులు తదితరులు పాల్గొన్నారు.